సాక్షి
వికారాబాద్

శనివారం, 29, జూన్, 2024



మొక్కజొన్నకు అనుకూలం

ప్రస్తుతం మొక్కజొన్న సాగుకు అనుకూలమైన సమయమని వ్యవసాయ అధికారులు అంటున్నారు.

10లో▸



బిల్లుల చెల్లింపులో జాప్యం

మధ్యాహ్న భోజన బిల్లులు అందక నిర్వాహకులు, వేతనాల రాక కార్మికులు ఆందోళనకు గురవుతున్నారు.

10లో▸



కౌన్ బనేగా చైర్మన్?

దోమ పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ ఎన్నికపై ఉత్కంఠ నెలకొంది. ఈ సంఘంలో 10మంది డైరెక్టర్లు ఉంటారు.

10లో▸

న్యూస్‌రీల్

కొడంగల్ తైబజార్‌కు వేలం



వేలం నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్

కొడంగల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కొడంగల్ తైబజార్ వేలం నిర్వహించారు. చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలం కొనసాగింది. పట్టణానికి చెందిన సయ్యద్ నాసీర్ హుస్సేన్ రూ.4 లక్షల 97వేలకు తైబజార్‌ను దక్కించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు గనుల వేలం ఆపాలి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య



నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

పరిగి: కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన బొగ్గు గనుల వేలాన్ని వెంటనే ఆపి సింగరేణికి కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా శుక్రవారం సీపీఎం పార్టీ నేతలు పరిగి బస్టాండ్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన కేంద్రం వేలం వేయడం ఏంటని ప్రశ్నించారు. గనులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం ద్వారా ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. సింగరేణి గనులపై ఆధారపడి జీవిస్తున్న ఎన్నో కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో నగర నడి బొడ్డున వేలం నిర్వహించడం దారుణమన్నారు. వేలం ఆపేంతవరకు తమ పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు చంద్రయ్య, ప్రజల సంఘాల నాయకులు గోవింద్ నాయక్, చంద్రయ్య, హబీబ్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

'రాంగ్ నంబర్' పరిచయం

- సోషల్ మీడియాలో వేధింపులు
- యువకుడికి రిమాండ్

తాండూరు రూరల్: రాంగ్ నంబర్ డయల్ చేయడంతో ఓ బాలిక, వివాహితుడి మధ్య చోటుచేసుకున్న పరిచయం.. సదరు వ్యక్తిని జైలు పాలు చేసింది. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్ రెడ్డి వివరాల ప్రకారం..తాండూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(17).. కొద్ది నెలల క్రితం తన స్నేహితురాలికి ఫోన్ చేయబోగా.. ఏపీలోని నెల్లూరు జిల్లాకు చెందిన శ్రీనివాస్‌కు వెళ్లింది. ఇదే అదనుగా బాలికతో స్నేహం పెంచుకున్న వివాహితుడు స్నేహం పేరుతో వాట్సాప్ చాటింగ్ చేస్తూ, ఇన్‌స్టాగామ్‌లో మాటలు కలిపాడు. కొద్ది రోజులుగా అసభ్యకరమైన మెస్సేజ్‌లతో హింసిస్తున్నాడు. బాధిత బాలిక విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫోన్ నంబర్ ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు శ్రీనివాస్‌ను నెల్లూరులో ఉన్నట్లుగా ఆచూకీ కనుగొన్నారు. శుక్రవారం అతన్ని కరన్‌కోట్ పీఎస్‌కు తీసుకొచ్చారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

లేఖ్య.. లేదిక

చికిత్స పొందుతూ లా విద్యార్థిని కన్నుమూత

శంకర్‌పల్లి: వేడి నీళ్లు ఒంటిపై పడి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న ఇక్ఫాయ్ యూనివర్సిటీ ఎల్ఎల్‌బీ ఫైనల్ ఇయర్ విద్యార్థిని లేఖ్య(21) శుక్రవారం మృతిచెందింది. గత నెల 15న సాయంత్రం వేళ స్నానం చేసేందుకు వాష్‌రూమ్‌లోకి వెళ్లిన యువతి.. అతి వేడిగా ఉన్న నీళ్లను గమనించకుండా ఒంటిపై పోసుకోవడంతో 40శాతం చర్మం కాలిపోయిన విషయం తెలిసిందే. వెంటనే ఆమెను అంబులెన్స్‌లో కాంటినెంటల్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఓమ్నీ ఆస్పత్రిలో, ఆ తర్వాత కంచన్‌బాగ్‌లోని అపోలోలో చేర్పించారు. మొదట యాసిడ్ దాడి జరిగినట్లు కుటుంబ సభ్యులు భావించినా.. ల్యాబ్ పరీక్షల ద్వారా వేడి నీళ్లు పడటంతోనే గాయాలయ్యాయని నిర్ధారించారు. విద్యార్థి చికిత్స కోసం కాలేజీ యాజమాన్యం సైతం పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేసింది. అయినప్పటికీ లేఖ్య కన్నుమూయడంతో కాలేజీలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతురాలి స్వస్థలం తిరుపతి కాగా.. మేనమావ సంరక్షణలో ఉంటోంది.

హాస్టల్ ఫుడ్.. ఆస్పత్రి బెడ్

పలు వసతి గృహాల్లో నాణ్యత లేని భోజనం

పేద విద్యార్థుల చదువుకు భోజనం, వసతి అడ్డు కారాదనే ఉద్దేశంతో ప్రభుత్వాలు సంక్షేమ వసతి గృహాలకు శ్రీకారం చుట్టాయి. ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా పిల్లలకు నాణ్యమైన భోజనం అందడం లేదు. కలుషిత ఆహారం కారణంగా ఆస్పత్రుల పాలవుతున్నారు. తరచూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా పరిగి మండలం నస్కల్ కేజీబీవీలో 26 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికావడం హాస్టళ్ల నిర్వహణ తీరుకు అద్దం పడుతోంది.



పరిగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

- ఆస్పత్రిపాలవుతున్న విద్యార్థులు
- తరచూ చోటుచేసుకుంటున్న ఘటనలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- ఆందోళనలో తల్లిదండ్రులు
- తాజాగా నస్కల్ కేజీబీవీలో 26మంది బాలికలకు అస్వస్థత

వికారాబాద్: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల పరిస్థితి నానాటికి తీసికట్టుగా మారుతున్నాయి. ఉన్నతాధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో వార్డెన్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. హాస్టల్ భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురి కావటం తరచూ చోటుచేసుకుంటున్నాయి. విద్యార్థులు ఆస్పత్రుల పాలైనప్పుడు హడావుడి చేసే అధికారులు ఆ తరువాత మిన్నకుండి పోతున్నారు. తాజాగా నస్కల్ కేజీబీవీలో 26 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో అందరి దృష్టి హాస్టళ్ల వైపు మళ్లింది. అయితే విద్యార్థులు అస్వస్థతకు గల కారణాలు మాత్రం బయటికి రావడం లేదు. ఎప్పటిలాగే మరో శాఖపై నెపం నెట్టే ప్రయత్నం చేస్తున్నారు. తమ వి ద్యాలయంలో భోజనం, నీళ్లు, పరిసరాలు బాగానే ఉన్నాయని విద్యార్థినులు వేసుకున్న ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల వల్ల అస్వస్థతకు గురై ఉంటారని హాస్టల్ అధికారులు అంటున్నారు. అయితే ఐరన్ మాత్రలను జిల్లాలో ఉన్న అన్ని పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎక్కడా సమస్య రాలేదు. కానీ నస్కల్ కేజీబీవీలో మాత్రమే ఇలా జరిగిందని చెప్పడం అనుమానాలకు తావిస్తోంది.

గతంలోనూ పలు ఘటనలు

వసతి గృహ విద్యార్థినులకు సన్న బియ్యంతో అన్నం, వివిధ రకాల కూరగాయలతో భోజనం పెడుతున్నట్లు ప్రభుత్వం ప్రకటిస్తోంది. వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. మెనూ సక్రమంగా అమలు కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. తక్కువ ధరకు వచ్చే కూరగాయలు సరఫరా చేస్తున్నా వాటినే వండుతున్నట్లు తెలుస్తోంది. చాలా హాస్టళ్లలో పారిశుద్ధ్యం లోపించింది. దీంతో విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారు. గతంలో చౌడాపూర్ మండలం కొత్తపల్లి ఆశ్రమ హాస్టళ్లలో విద్యార్థులు తమ సమస్యలను పరిష్కరించాలంటూ సుమారు 10 కిలోమీటర్ల దూరంలోని మండల కేంద్రానికి నడుచుకుంటూ వచ్చి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. మంచి భోజనం పెట్టమని అడిగితే తమపై వార్డెన్ తిడుతున్నారని విద్యార్థులు ఆరోపించారు. కుల్కచర్ల మండలంలోని ఓ వసతి గృహంలో పదుల సంఖ్యలో విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనను చూశాం. ఇలా ఒక్కడో ఒక చోట విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్నా అధికారులకు పట్టడం లేదు.

పర్యవేక్షణ గాలికి

హాస్టళ్లలో పర్యవేక్షణాలోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. జిల్లాలో సోషల్ వెల్ఫేర్, బీసీ, ఎస్టీ, మైనార్టీ, స్త్రీ శిశు సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీలు దాదాపు వంద వరకు ఉన్నాయి. వీటిలో వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. సమస్యలపై విద్యార్థులు రోడ్డెక్కితే తప్ప అసలు విషయం బయట పడటం లేదు. చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. వార్డెన్ల నుంచి మామూళ్లకు అలవాటు పడిన అధికారులు పర్యవేక్షణను గాలికొదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో జిల్లాలోని హాస్టళ్లను సందర్శించి సమస్యల జాబితాను రూపొందించాలని కలెక్టర్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఇప్పట్లో అన్ని శాఖల జిల్లా అధికారులు మూడేసి చొప్పున వసతి గృహాలను సందర్శించారు. కానీ సమస్యలు పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా అధికారులు వసతి గృహాలపై దృష్టి సారించాల్సి ఉంది.

కలెక్టర్, ఎమ్మెల్యే పరామర్శ

పరిగి: కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థినులను శుక్రవారం ఉదయం కలెక్టర్ ప్రతీక్ జైన్ పరామర్శించారు. బాలికలకు మెరుగైన చికిత్స అందించాలని సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలోని నస్కల్ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో గురువారం సాయంత్రం అల్పాహారం తిన్న తర్వాత ఐరన్ మాత్రలు వేసుకున్న 26 మంది విద్యార్థులు వాంతులు చేసుకోవడంతో రాత్రి వేళ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఉదయాన్నే ఆస్పత్రికి వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో విద్యార్థులందరినీ డిశ్చార్జ్ చేసి హాస్టల్‌కు పంపించారు. స్థానిక ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి వసతిగృహానికి వెళ్లి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎవరూ అధైర్య పడొద్దని ఏ సమస్య ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. హాస్టల్‌లో అందించే ఆహారం విషయంలో నాణ్యత, శుభ్రత పాటించాలని ఆదేశించారు. ఇదిలాఉండగా ఆరోగ్యం కుదుటపడని ఆరుగురికి మరో సారి వైద్యం అందించి హాస్టల్‌కు తరలించారు.



విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

బీఆర్ఎస్‌కు షాక్

- సొంతగూటికి చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య
- అంతర్మథనంలో గులాబీ శ్రేణులు
- కలవరంలో కాంగ్రెస్ నాయకులు



చేవెళ్ల: చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడం ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశమైంది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పలువురు ఎమ్మెల్యేలు పార్టీ మారతారనే సంకేతాలు వచ్చినప్పుడల్లా కాలె యాదయ్య పేరు కూడా ప్రధానంగా వినిపిస్తూ వచ్చింది. ఆయన మాత్రం ఎప్పటికప్పుడు దీనిని కొట్టిపారేస్తూ పార్టీ మారే ప్రసక్తే లేదంటూ ప్రకటిస్తూ వచ్చారు. చివరికి పార్టీ మారతారనే ప్రచారాన్ని నిజం చేశారు.

కాంగ్రెస్ పార్టీతోనే రాజకీయ జీవితం

కాలె యాదయ్య రాజకీయ జీవితంలో అధిక భాగం కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగింది. ఆ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాతే ఆయన బీఆర్ఎస్‌లోకి మారారు. ఇప్పుడు బీఆర్ఎస్‌లో గెలిచి సొంతగూటికి చేరుకున్నారు. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం చించల్‌పేట గ్రామానికి చెందిన కాలె యాదయ్య 1980లో రాజకీయరంగ ప్రవేశం చేశారు. మొదట డీసీఎంఎస్ డైరెక్టర్‌గా, తరువాత సింగిల్ విండో చైర్మన్‌గా, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్‌గా పనిచేశారు. 1995లో నవాబుపేట జెడ్పీటీసీగా ఎన్నికయ్యారు. 2001 నుంచి 2006 వరకు నవాబుపేట ఎంపీపీగా పనిచేశారు. 2009లో చేవెళ్ల నియోజకవర్గంలోకి నవాబుపేట మండలం కలవడం.. ఎస్సీగా రిజర్వుకావడంతో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకున్నారు. ఆ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కేఎస్ రత్నం చేతిలో 2,249 ఓట్లతో ఓటమి పాలయ్యారు. 2014లో మళ్లీ పోటీ చేసి అప్పటి టీఆర్ఎస్‌పార్టీ నుంచి పోటీ చేసిన కేఎస్ రత్నంపై 781ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఏడాదిలోనే అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌లో చేరారు. 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి 33,552 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి కేఎస్ రత్నంపై గెలుపొందారు. 2023లో జరిగిన ఎన్నికల్లో రెండోసారి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా పోటీ చేసి 268 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్‌పై గెలిచారు.

సోషల్ మీడియాలో వైరల్

ఎమ్మెల్యే యాదయ్య కాంగ్రెస్‌లో చేరిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్థానికంగా చర్చలు మొదలయ్యాయి. ఎమ్మెల్యే పార్టీ మారిన విషయంపై ఇరు పార్టీల నాయకులు తమదైన శైలిలో స్పందించారు. కొందరు పార్టీ మారడాన్ని సమర్థిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడితే.. మరికొందరు వ్యతిరేకిస్తూ పోస్టులు పెట్టారు. ఎమ్మెల్యే యాదయ్య గతంలో పార్టీ మారబోనని చెప్పిన వీడియోలను ట్రోల్ చేశారు.

సంశయంలో బీఆర్ఎస్ నాయకులు

నిన్నటి వరకు తమకు రాష్ట్రంలో అధికారం లేకపోయినా స్థానికంగా ఎమ్మెల్యే ఉన్నాడని భావించిన బీఆర్ఎస్ శ్రేణులు ఆయన కాంగ్రెస్‌పార్టీలోకి మారడంతో అంతర్మథనంలో పడ్డారు. కొందరు ఆయనతో వెళ్లాలా.. వద్దా అన్న సంశయంలో ఉండగా మరి కొంతమంది ఆయనతోనే వెళ్తామని బాహాటంగానే చెబుతున్నారు. యాదయ్య గెలుపుకోసం పార్టీలో కష్టపడి పనిచేసిన కొందరు కార్యకర్తలు ఆయన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. గ్రామాల్లో తమకు గతంలో ఎదురైన ఘటనలు, భవిష్యత్తులో ఎదురయ్యే పరిస్థితులను అంచనా వేసుకుంటున్నారు.

> **నియోజకవర్గ అభివృద్ధి కోసమే..**
>
> నియోజకవర్గ అభివృద్ధికోసమే కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. అందరినీ కలుపుకొని సమన్వయంతో కాంగ్రెస్ పార్టీలో ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం సాయంతో నెరవేరుస్తానని చెప్పారు. మూడుసార్లు నియోజకవర్గ ప్రజలు అవకాశం కల్పించారని.. వారికి ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన

కాలె యాదయ్య కాంగ్రెస్‌లో చేరడంతో కాంగ్రెస్ నాయకులు కలవరపడుతున్నారు. నామినేటెడ్ పదవులు, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎమ్మెల్యే తన మనుషులకే సముచిత స్థానం ఇచ్చే అవకాశం ఉంటుందని చర్చించుకుంటున్నారు. మరోవైపు ఎమ్మెల్యే యాదయ్యపై అతి స్వల్ప మెజార్టీతో ఓటమిపాలైన కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్ ఆయనతో కలిసి పనిచేస్తారా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

దెబ్బమీద దెబ్బ

అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఎమ్మెల్సీ కసిరెడ్డి పార్టీని వీడారు. కాంగ్రెస్‌లో చేరి కల్వకుర్తి నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి విజయం సాధించారు. అంతకుముందే ఇబ్రహీంపట్నం సీనియర్ నేత చంద్రశేఖర్‌రెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ దంపతులు పారిజాత నర్సింహారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి పార్టీని వీడారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ రాష్ట్ర వ్యాప్తంగా ఓటమిని చవిచూసినా.. రంగారెడ్డిలో మాత్రం హవా కొనసాగించింది. శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, చేవెళ్ల, ఎల్బీనగర్, మహేశ్వరంలో బీఆర్ఎస్ అభ్యర్థులే విజయం సాధించారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఆయన సతీమణి వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఆయన కోడలు జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి పార్టీని వీడారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్లు ప్రతీక్‌జైన్, సిక్తా పట్నాయక్

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

- వికారాబాద్, నారాయణపేట కలెక్టర్లు ప్రతీక్ జైన్, సిక్తా పట్నాయక్
- రెండు జిల్లాల ఉన్నతాధికారులతో సమీక్ష

కొడంగల్: కొడంగల్ నియోజకవర్గానికి మంజూరైన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని వికారాబాద్, నారాయణపేట జిల్లాల కలెక్టర్లు ప్రతీక్ జైన్, సిక్తా పట్నాయక్ ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని కడా కార్యాలయంలో రెండు జిల్లాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలన్నారు. మంజూరైన పనులకు వెంటనే టెండర్లు పిలవాలని ఆదేశించారు. రోడ్ల విస్తరణపై ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. కళాశాలల భవన నిర్మాణాలకు భూసేకరణ చేయాలని సూచించారు. మిషన్ భగీరథ నీరు ప్రతి ఇంటికీ అందేలా చూడాలన్నారు. నీటి ట్యాంకులు, పైప్‌లైన్ నిర్మాణాల కోసం ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. చెక్‌డ్యాంల నిర్మాణం, అటవీ భూముల్లో జరుగుతున్న పనులపై ఆరా తీశారు. ప్రతి వారం నిర్వహించే సమీక్షలో పనుల పురోగతిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కొడంగల్ నియోజకవర్గానికి సంబంధించిన గురుకులాలు స్థానికంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్ రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రప్రియ, తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధి మైసిగండి ఆలయం పరిసరాలలో రూ.15 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులకు, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అధికారులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే భూమిపూజ చేసి మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ పాలన కొనసాగుతుందని, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని తెలిపారు. అనంతరం మైసిగండి మైసమ్మ ఆలయాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి,ఆయన సతీమణి మాధవి దర్శించుకుని, అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు.

మెరుగైన వైద్యమే లక్ష్యం

- కలెక్టర్ ప్రతీక్ జైన్
- తాండూరు జిల్లా ఆస్పత్రిలో తనిఖీలు

తాండూరు టౌన్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూస్తామని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. డయాలసిస్ సెంటర్, వార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలపై బాధిత బంధువులతో మాట్లాడి తెలుసుకున్నారు. బెడ్లు, శానిటేషన్, ఇతర సౌకర్యాలపై డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రదీప్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మూర్తిని అడిగి తెలుసుకున్నారు. ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులు ఉండటాన్ని గమనించారు. రెండేళ్ల క్రితం కాలిన గాయాలతో వస్తే సరైన వైద్యం అందక తన సోదరుడు మృతి చెందాడని ఓ వ్యక్తి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇకపై అలా జరగకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోగుల కోసం త్వరలోనే 50 అదనపు బెడ్లు ఏర్పాటు చేస్తామని, మెరుగైన వైద్యం అందేలా చూస్తామన్నారు. ప్రతి వార్డులో తాగునీటి సదుపాయం కల్పించాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. అలాగే రోగులతో వచ్చిన వారికి చిన్న డైనింగ్ హాల్, విశ్రాంతి గది, ప్రత్యేకంగా మరుగుదొడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీని ప్రధాన మురుగు కాలువతో కలిపేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇందుకు అవసరమయ్యే నిధుల కోసం ప్రతిపాదనలు పంపాలన్నారు. ఆస్పత్రిలో పారిశుద్ధ్య వ్యవస్థ బాగుందని, మరిన్ని వసతుల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.



తాండూరు ఆస్పత్రిలో రోగి బంధువుతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్, డీసీహెచ్ఎస్ ప్రదీప్

ప్రజాపాలన కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

అనంతగిరి: ప్రజా పాలనలో దరఖాస్తుల్లో తప్పుల సవరణకు ఏర్పాటు చేసిన సేవా కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో సేవా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గృహ జ్యోతి, గ్యాస్ సిలిండర్ రాయితీ పథకాల కోసం కరెంటు బిల్లు, రేషన్, ఆధార్ కార్డు వివరాలు అందజేయాలని సూచించారు.

స్కూళ్లను పరిశుభ్రంగా ఉంచాలి

పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పనికి రాని వస్తువులను తొలగించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, మిషన్ భగీరథ ఇంటింటి సర్వేపై జిల్లా, మండల స్థాయి అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లోని పనికిరాని ఫర్నిచర్, వస్తువులు, పుస్తకాలను వారం రోజుల్లో తొలగించాలని ఆదేశించారు. ప్రహరీలు లేని స్కూళ్లకు ఇనుప కంచెతో గేటు ఏర్పాటు చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టే పనుల్లో నాణ్యత ఉండాలని తెలిపారు. అలాగే మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. కొడంగల్ మండలం గుండ్లకుంట పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. సమావేశంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, జెడ్పీ సీఈఓ సుధీర్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, డీఈఓ రేణుకాదేవి, మిషన్ భగీరథ ఈఈ బాబు శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఈఈ ఉమేష్, మండల ప్రత్యేక అధికారులు రాంరెడ్డి, దీపారెడ్డి, సత్తార్, మల్లేశం, వినయ్‌కుమార్, గోపాల్, వీరభద్రరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజీస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయుడు కన్నీటి పర్యంతం

దౌల్తాబాద్: మండల పరిధి గోకఫసల్వాద్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు నర్సింలు బదిలీల్లో భాగంగా చౌదర్‌పల్లి ఉన్నత పాఠశాలకు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఈ క్రమంలో రిలీవింగ్ ఆర్డర్ కోసం వచ్చిన టీచర్‌ను విద్యార్థులు అడ్డుకున్నారు. 'మమ్మల్ని విడిచి వెళ్లొద్దు సార్' అంటూ విలపించగా.. ఉపాధ్యాయుడు నర్సింలు వారిని సముదాయిస్తూ.. కన్నీటి పర్యంతం అయ్యారు. అనంతరం తేరుకుని మీరంతా మంచిగా చదుకుని.. కన్నవారికి, ఉన్న ఊరికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని విద్యార్థులను కోరారు.

బోదకాలు బాధితులకు కిట్స్ పంపిణీ



కిట్లను అందజేస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి

యాలాల: ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో ఎంఎండీపీ(మార్బిడిటీ మేనేజ్‌మెంట్ డిజేబులిటీ ప్రివెన్షన్) కిట్లను పంపిణీ చేశారు. ఈ కిట్లను జిల్లా ఉప వైద్యాధికారి, తాండూరు డివిజన్ డాక్టర్ రవీంద్ర యాదవ్ రోగులకు అందజేశారు. అనంతరం జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. రోగులకు మెరుగైన సేవలందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే బోదకాలు వ్యాధిగ్రస్తులకు కిట్లను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అనూష, సీహెచ్‌ఓ చంద్రశేఖర్ ఉన్నారు.

మూడు కిలోల సీహెచ్ పట్టివేత

బషీరాబాద్: కల్లు తయారీలో ఉపయోగించే మత్తు పదార్థం సీహెచ్‌ను బషీరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం అర్ధరాత్రి గస్తీలో భాగంగా పోలీసులు ఇందర్ చెడ్ రోడ్డు మార్గంలో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న రాజుగౌడ్, రాజేష్‌గౌడ్‌ను పట్టుకున్నారు. వారిని సోదా చేయగా.. 3కిలోల సీహెచ్ లభ్యమయింది. ఈ మేరకు శుక్రవారం వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా కొడంగల్‌కు చెందిన రాజుగౌడ్.. కర్ణాటక రాష్ట్రం చిత్తపూర్ గ్రామానికి చెందిన రాజేష్ గౌడ్‌కు సీహెచ్‌ను విక్రయించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

కూలిన ఇల్లు

పెద్దేముల్: గురువారం రాత్రి కురిసిన వర్షానికి పెద్దేముల్ మండలం కందనెల్లి గ్రామంలో మట్ట బాల్‌రాజ్ అనే రైతు ఇల్లు వెనుక భాగం కూలిపోయింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఘటనా స్థలాన్ని పంచాయతీ కార్యదర్శి రమేష్ శుక్రవారం పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి రెవెన్యూ అధికారులను కోరారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

దోమ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఈ సంఘటన శుక్రవారం మండల పరిధి దిర్సంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ సమీపంలోని వాగులో ఓ వ్యాపారి తన ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్ఐ ఆనంద్ కుమార్ తెలిపారు.

సంక్షేమ పథకాల అమలుపై దృష్టి పెట్టండి

కుల్కచర్ల: ఇతర పార్టీల నేతలను చేర్చుకోవడంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచిస్తున్న విధానంలో కొంతైనా సంక్షేమ పథకాల అమలుపై దృష్టి సారించాలని పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్ అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పాలన అందించడం మరిచి, ఇతర పార్టీలకు చెందిన నేతలకు చేర్చుకోవడంపై దృష్టి సారించారని ఆరోపించారు. అవకాశవాద రాజకీయాలకు పాల్పడటం సరికాదని హితవు పలికారు.

కౌన్ బనేగా చైర్మన్?

- పాల ఉత్పత్తిదారుల చైర్మన్ ఎన్నికపై కొనసాగుతున్న ఉత్కంఠ
- ఇద్దరు డైరెక్టర్ల నియామకానికి ఎన్నికలు
- రెండు స్థానాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థుల విజయం
- 10 మంది డైరెక్టర్లలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు చెరో ఐదుగురు



కొత్తగా ఎన్నికైన డైరెక్టర్లు చంద్రానాయక్, మల్లేశ్‌తో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

దోమ: దోమ పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ ఎన్నికపై ఉత్కంఠ నెలకొంది. ఈ సంఘంలో మొత్తం 10 మంది డైరెక్టర్లు ఉంటారు. వీరి పదవీ కాలం పదేళ్లు. గడువు ముగిసిన రెండు స్థానాలకు శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. రెండింటిలోనూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. దీంతో పది మంది డైరెక్టర్లలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు చెరో ఐదు స్థానాలు ఉండటంతో చైర్మన్ ఎన్నికపై ఉత్కంఠ నెలకొంది. ఇద్దరు డైరెక్టర్ల కోసం శుక్రవారం ఎన్నికలు నిర్వహించగా నలుగురు అభ్యర్థులు పోటీ పడ్డారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన చంద్రానాయక్, మల్లేశ్.. బీఆర్‌ఎస్ అభ్యర్థులు మహిపాల్, శ్రీనివాస్‌పై విజయం సాధించారు.

ప్రలోభాల పర్వం

దోమ పాల ఉత్పత్తిదారుల సంఘంలో మొత్తం పది మంది డైరెక్టర్లు ఉండగా బీఆర్‌ఎస్‌కు ఐదుగురు, కాంగ్రెస్‌కు ఐదుగురు ఉన్నారు. వీరిలో ఒకరిని శనివారం చైర్మన్‌గా ఎన్నుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇరు పార్టీలకు చెందిన నాయకులు ఒక డైరెక్టర్ స్థానంపై గురి పెట్టారు. ఎలాగైనా ఒక డైరెక్టర్‌ను తమవైపు తిప్పుకుంటే తమకే చైర్మన్ అయ్యే అవకాశం ఉంటుందని ఇరు పార్టీలు భావిస్తున్నాయి. ఆ దిశగా మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. కొత్తగా ఎన్నికైన ఇద్దరు డైరెక్టర్లు చంద్రానాయక్, మల్లేశ్‌ను ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు, సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణలో ఏకాగ్రత ముఖ్యం

ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: శిక్షణలో ఏకాగ్రత ముఖ్యమని, క్రమశిక్షణతో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకోవాలని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శిక్షణ పొందుతున్న కానిస్టేబుల్ అభ్యర్థులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. శిక్షణ కాలంలో నేర్చుకున్న యోగా, మెడిటేషన్, వ్యాయామాలను శిక్షణ అనంతరం కొనసాగిస్తే బాగుంటుందన్నారు. జూలై 1 నుంచి మారుతున్న చట్టాలపైన, సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్పీ తెలిపారు. అనంతరం శిక్షణ గురించి డీటీసీ కేంద్రం ప్రిన్సిపాల్ పీవీ మురళీధర్‌తో మాట్లాడారు. శిక్షణ కేంద్రం పరిసరాలను, తరగతి గదులను, వంటగదిని, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, బ్యారక్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ విజయ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ వీరేష్, ఇన్‌స్పెక్టర్ వెంకట్రాం, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ ప్రమీల, ఆర్ఐ నాగరాజు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి



పుష్పాలకు పూజలు చేస్తున్న దంపతులు



ధారూరులో..

వికసించిన బ్రహ్మ కమలం

కొడంగల్ రూరల్: శివుడికి అత్యంత ప్రీతికరమైన బ్రహ్మ కమలం గురువారం రాత్రి పట్టణంలోని లాహోటి కాలనీ బత్తుల మల్లయ్య నివాసంలో వికసించింది. ఈ సందర్భంగా యజమాని మల్లయ్య పుష్పాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా బత్తుల దంపతులు మాట్లాడుతూ.. మా ఇంట్లో ఈ పుష్పాలు వికసించడం అదృష్టంగా బావిస్తున్నామని తెలిపారు.

ధారూరులో..

ధారూరు: మండల కేంద్రంలోని శ్రీనివాస్‌రెడ్డి ఇంటి పెరట్లోని బ్రహ్మకమలం మొక్కకు గురువారం రాత్రి 6 బ్రహ్మ కమలం పుష్పాలు విరబూశాయి. వాటిని శుక్రవారం ఉదయం కపిలేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి సమర్పించారు.

బిల్లుల చెల్లింపులో జాప్యం

- నిరీక్షిస్తున్న నిర్వాహకులు
- కష్టంగా మారిన మధ్యాహ్న భోజనం
- వేతనాలు అందక కార్మికుల వెతలు

దౌల్తాబాద్: మధ్యాహ్న భోజన బిల్లులు అందక నిర్వాహకులు, వేతనాల రాక కార్మికులు నిరీక్షిస్తున్నారు. మూడు నెలలుగా వేతనాలు, బిల్లులు నిలిచిపోవడంతో నిర్వహణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. మండలంలో 6 ఉన్నత, 8 యూపీఎస్, 28 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఈ బడుల్లో మధ్యాహ్న భోజనం వంటకానికి పలువురు కార్మికులు పనిచేస్తుంటారు. కిరాణా సరుకులు, కూరగాయాలు, కోడిగుడ్లకు తదితర సామగ్రికి కలిపి నెలకు రూ.1.50లక్షలు బిల్లులు వస్తాయి. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలకు సంబంధించిన రూ.2,40,648, వర్కర్లకు రూ.1.76లక్షలు రావాల్సి ఉంది. ఇప్పటి వరకు జీతాలు, బిల్లులు అందకపోవడంతో కార్మికులు ఆందోళనలు చేపడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదు. కూరగాయలు, కిరాణా దుకాణంలో అప్పులు పెరిగిపోతున్నాయని, మరింత అప్పు చేసి.. సామగ్రి తెచ్చి భోజనం వడ్డిస్తున్నామని నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. నిత్యవసరా సరకుల ధరలు పెరిగినా విద్యార్థులకు భోజనం వడ్డించామని పేర్కొంటున్నారు.



మధ్యాహ్న భోజనం చేస్తున్న నిర్వహకులు

త్వరలో వచ్చేలా చర్యలు



మండలంలో మధ్యాహ్న భోజన నిర్వాహకుల బిల్లులు, కార్మికుల వేతనాలు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. బిల్లులు చేసి ఎస్టీఓకు పంపాము. త్వరలో వచ్చేలా చర్యలు తీసుకుంటాము.

– వెంకటయ్య, ఎంఈఓ, దౌల్తాబాద్

పాఠశాలలు ప్రారంభమై 15 రోజులు అయినప్పటికీ.. బిల్లులు చెల్లించడం లేదని, దీంతో నిర్వహణ భారం అయిందని తెలిపారు. అధికారులు స్పందించి నిర్వహణ బిల్లులు, వేతనాలు వెంటనే చెల్లించాలని నిర్వాహకులు, కార్మికులు కోరుతున్నారు.

'మొక్కజొన్న'కు అనువైన సమయం

నల్లరేగడి, ఎర్ర నేలలు అనుకూలం

- నీటి తడులతో అధిక దిగుబడులు
- యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలు
- మండల వ్యవసాయ అధికారి లక్ష్మీ ప్రసన్న





నవాబుపేటలో మొక్కజొన్న పంట(ఫైల్)

నవాబుపేట: ప్రస్తుతం మొక్కజొన్న సాగుకు అనుకూలమైన సమయమని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే చాల మంది రైతులు సాగు పనుల్లో బిజీగా ఉన్నారని, యాజమాన్య పద్ధతులు పాటిస్తే.. అధిక దిగుబడులతో పాటు, అదే స్థాయిలో లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి లక్ష్మీ ప్రసన్న సూచిస్తున్నారు.

నేలలు

సారవంతమైన, నీరు ఇంకే నల్లరేగడి నేలలు, ఎర్ర నేలలు, ఒండ్రు కలిగిన ఇసుక నేలలు మొక్కజొన్న సాగుకు అనుకూలమైనవి. చౌడు భూములు, నీరు నిలువ ఉండు జాగలు ఈ పంటకు అనుకూలించవు.

సాగుకు అనుకూలంగా నేల..

విత్తు విత్తేందుకు ముందు మూడు నాలుగు సార్లు నాగలితో దుక్కి దున్నాలి. ఒక ఎకరాకు సుమారు 10 టన్నుల బాగా మాగిన పశువుల ఎరువును ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలి. తర్వాత బోదె నాగలితో బోదెలు, కాలువలు చేసుకోవాలి.

విత్తే కాలం

సాధారణ పరిస్థితుల్లో వర్షాధారపు పంటను జూన్ 15 నుంచి జులై 15 వరకు వేసుకోవచ్చు. యాసంగిలో అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15 లోగా విత్తితే ఎక్కువ దిగుబడులు పొందడానికి అవకాశం ఉంటుంది.

విత్తే విధానం

మొదలు బోదె నాగలితో బోదెలు చేసుకోవాలి. తర్వాత విత్తనాన్ని బోదెకు పైనుంచి 1బై3 వంతు ఎత్తులో విత్తితే నీటి పారుదల సులభంగా ఉండడమే కాకుండా, వర్షాపాతం ఎక్కువైనప్పుడు నీరు బయటకు పోవడానికి వీలుంటుంది. మొలకెత్తిన పది రోజుల తర్వాత ఒత్తుగా మొలచిన చోట ఒక మొక్కను మాత్రమే ఉంచి అదనంగా ఉన్న మొక్కలు తీసివేయాలి.

కలుపు యాజమాన్యం

పంట విత్తిన తర్వాత రెండు, మూడు రోజుల లోపు అట్రజిన్ అనే కలుపు మందును తేలిక నేలల్లో ఎకరాకు 800 గ్రాములు పిచికారీ చేయాలి. బరువు నేలలో అయితే ఎకరాకు 1200 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి, విత్తిన నేలపై తగినంత తేమ ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. దీని వలన కొన్ని గడ్డిజాతి కలుపు మొక్కలను ఒక నెల వరకు అదుపు చేయవచ్చు. మొక్కజొన్నను పప్పు జాతి పంటలతో అంతరపంటగా వేసినప్పుడు చేయాలి. విత్తిన నెల రోజులకు వెడల్పాటి కలుపు మొక్కలు గమనిస్తే 2,4–డి సోడియం సాల్ట్ ఎకరాకు 500 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీచేయాలి. ఇలా చేస్తే పంట దిగుబడి అధికంగా వచ్చే అవకాశం ఉంది.

అంతర కృషి

విత్తిన 30–35 రోజులకు పశువులతో (దంతి లేక గొర్రు) లేదా ట్రాక్టర్‌తో అంతర కృషి చేస్తే కలుపు మొక్కలను నివారించవచ్చు. తర్వాత నత్రజని ఎరువును వేసి దాని వెంటనే బోదె నాగలిని నడిపిస్తే కలుపు మొక్కల నివారణతో పాటు వేసిన ఎరువు పంట పెరుగుదలకు సక్రమంగా వినియోగపడుతుంది. ఈ విధంగా బోదె నాగలి నడిపితే మొక్కల కుదుళ్లపై మట్టి చేర్చబడి అవి పడిపోకుండా ఉంటాయి.

కాండం తొలుచు పురుగు

కాండం తొలుచు పురుగు రెండు రకాలు. మచ్చల, చారల పురుగు ఎక్కువగా వానాకాలం పైరును, గులాబీ రంగు పురుగు రబీ మొక్కజొన్నను ఆశిస్తుంది. ఇవి పైరు మొలకెత్తిన 10–20 రోజులకు సోకుతాయి. పిల్ల పురుగులు మొదట ఆకులపైన పత్ర హరితాన్ని గోకి తింటాయి. తర్వాత గుండు సూది మాదిరి రంధ్రాలు, పొడవాటి చిల్లులు వరుస క్రమంలో కనిపిస్తాయి. లార్వాలు ఎదిగే అంకురాన్ని తినడం వలన పువ్వు చనిపోయి ఎండిపోతుంది. దీనినే డెడ్‌హార్ట్ అంటారు. కాండం లోపల గుండ్రని లేదా ఎస్ ఆకారంలో సొరంగాలను ఏర్పరుస్తుంది. ఇవి పూతను, కంకినీ ఆశించడంతో దిగుబడి తగ్గుతుంది.

తుప్పు తెగులు

ఆకులపై రెండు వైపులా గుండ్రని లేక పొడవాటి గోధుమ వర్ణపు పొక్కుల లాగా తెగులు లక్షణాలు కనిపిస్తాయి. పంట పెరిగిన కొద్దీ.. ఆకులపైన పొక్కులు గోధుమ వర్ణం నుంచి నలుపు రంగుకు మారుతాయి.

ఉధృతి ఎక్కువగా ఉంటుంది

పై రెండు రకాల తెగుళ్ల నివారణకు మాంకోజెట్ ఎకరానికి 500 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి తెగులు తీవ్రతను బట్టి, ఒకటి లేక రెండు సార్లు పిచికారీ చేయాలి. విత్తే ముందు కిలో విత్తనానికి 2.5 గ్రాముల మాంకోజెట్ శిలీంద్రనాశినితో విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలి.

నివారణ

అక్షింతల పురుగులు, సిర్ఫిడ్స్ వంటి పరాన్న భుక్కులు, పరాన్నజీవులు రసం పీల్చే పురుగులను అదుపులో ఉంచుతాయి. పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటే మోనోక్రోటోఫాస్ ఎకరాకు 320 మి.లీ లేదా డైమిథోయేట్ కలిపి పిచికారీ చేయాలి. ఈ పురుగును ఆశించే అవకాశం ఉంది.

రసం పీల్చే పురుగులు

30 రోజులు పైబడిన పైరును పేనుబంక, చిగురు నల్లి ఆశించవచ్చు. పొడి వాతావరణంలో వీటి ఉధృతి ఎక్కువగా ఉంటుంది. లేత కాండం నుంచి రసాన్ని పీల్చడంతో ఆకులు పసుపు రంగుకు మారిపోతాయి. మొక్క గిడసబారిపోతుంది. ఇవి విసర్జించే జిగిఉు పదార్థానికి చీమలు చేరడమే కాకుండా శిలీంద్రాలు ఏర్పడి, మసి తెగులు ఆశించడం వలన కిరనజన్య సంయోగ క్రియకు అంతరాయం ఏర్పడి దిగుబడి తగ్గుతుంది.

నీరు నిలిస్తే విత్తనం మొలకెత్తదు

మొక్కజొన్న పూతకు ముందు, పూత దశలో, గింజ పాలు పోసుకునే దశలో బాగానీరు పెట్టాలి. 30–40 రోజుల లోపు ఉన్న లేత పైరుకు అధిక నీరు హానీకరం. విత్తిన తర్వాత చేనులో నీరు నిలిస్తే విత్తనం మొలకెత్తదు. సాధారణంగా పంట కాలంలో 6–8 నీటి తడులు అవసరం. విత్తనాలు వేసినప్పుడు, విత్తిన 15 రోజులకు, 30–35 రోజులకు, పూతదశలో, పూత వచ్చిన 15 రోజులకు, గింజ పాలు పోసుకునే దశలో నీటి తడులను తప్పకుండా ఇచ్చేలా జాగ్రత్త పడాలి. దీర్ఘకాలిక వంగడాలను 1–2 తడులు అధికంగా అవసరమవుతాయి.

టర్సికమ్ ఆకు తెగులు

ఆకులపై పొడవైన, కోలాకారపు బూడిద రంగుతో ఆకుపచ్చ, గోధుమ వర్ణపుమచ్చలు కన్పిస్తాయి. ఈ మచ్చలు 2.5 నుంచి 25 సెం.మీ. పొడువు, 4 సెం.మీ. వెడల్పు ఉంటాయి. మచ్చలు మొదట మొక్కకింద ఆకులపై మొదలై.. క్రమంగా వ్యాపిస్తాయి. అధిక తేమతో కూడిన వాతావరణంలో ఆకు అంతా ఎండి మొక్కలు చనిపోయినట్లుగా కనిపిస్తాయి. శిలీంద్ర బీజాలు ఆకుల అడుగు భాగాన వలయాలుగా కనిపిస్తాయి. ఈ మచ్చలు కండం పైనా వ్యాపిస్తాయి.

'మహా' ఆలోచన

- ఓఆర్‌ఆర్ పక్కనే మహానగర నిర్మాణం
- రైతులను ఆందోళనకు గురిచేయొద్దు
- సేకరించిన భూముల్లో సకల పరిశ్రమల ఏర్పాటు
- ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు, ధరణీ కమిటీ సభ్యుడు కోదండరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కోదండరెడ్డి

యాచారం: ఓఆర్‌ఆర్ పక్కనే కాలుష్య రహిత మహా నగరాన్ని నిర్మించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టి సారించారని ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు, ధరణి కమిటీ సభ్యుడు ముదిరెడ్డి కోదండరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని తన నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గంలోని 19,333 ఎకరాల్లో మాజీ సీఎం కేసీఆర్ నిర్మించ తలపెట్టిన ఫార్మాసిటీని ప్రస్తుత సీఎం రేవంత్ ముందస్తు ఆలోచనలతో రద్దు చేశారని తెలిపారు.

అన్నీ ఒకేచోట

ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో మహానగర స్థాపనే లక్ష్యంగా విద్య, వైద్యం, శాస్త్ర, సాంకేతిక, ఐటీ రంగాలు ఒకే చోట ఉండే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ముదిరెడ్డి వెల్లడించారు. ఈ నగరానికి మెట్రో రైలు మార్గం ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. నగరం ఏర్పాటుకు సీఎం రేవంత్ మేధావులు, శాస్త్రవేత్తలు, రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులతో సమాలోచనలు చేస్తున్నారని, ఇది ఈ ప్రాంత వ్యవసాయ భూములకు, ప్రజలకు ఎలాంటి హానీ జరగదని పేర్కొన్నారు. ఫార్మాసిటీకి భూములిచ్చిన రైతులకు అన్యాయం జరగనీయమన్నారు.

స్థానికులకు ఉద్యోగ అవకాశాలు

ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో మళ్లీ పరిశ్రమలు వస్తున్నాయని, కాలుష్య పరిశ్రమల వలన ప్రజల ప్రాణాలకు ముప్పు తప్పదని కొందరు విష ప్రచారం చేస్తున్నారని, వారి మాటలు ప్రజలు నమ్మకూడదని కోదండరెడ్డి సూచించారు. జీవకోటికి ప్రమాదకరంగా భావించి ఫార్మాసిటీనే రద్దు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని, మళ్లీ ప్రజల ప్రాణాలకు ముప్పు తెచ్చే కంపెనీలను ఎందుకు ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని, సర్కార్‌కు సహకరిస్తే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి అవుతుందని, తద్వారా స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని స్పష్టంచేశారు. ఇంకా గోచీ పెట్టుకుని ఉందామా.. లేక ఈ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామా అనేది ప్రజలే నిర్ణయించాలని సూచించారు. అంతకు ముందు కుర్మిద్ద, నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి గ్రామాల రైతులతో ఆయన మాట్లాడారు.

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ నివారణ

ధారూరు: మయోగ్రామ్, సోనోమమోగ్రామ్, పాప్‌స్మియర్ వంటి సాధారణ పరీక్షలను కాలానుగుణంగా చేయించుకోవడం ద్వారా మహిళల్లో వచ్చే వివిధ రకాల క్యాన్సర్లను ముందుగానే గుర్తించి నివారించవచ్చని శ్రీసత్యసాయి సేవా సంస్థల మెడికల్ విభాగం రాష్ట్ర సమన్వయ కర్త భాస్కర్‌రావు సూచించారు. మండలం కేరెళ్లి గ్రామంలోని సత్యసాయి సార్వజనిక కేంద్రంలో శుక్రవారం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. మహిళ విభాగం సత్యసాయి సేవా సంస్థల అధ్వర్యంలో హైదరాబాద్ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి సహకారంతో పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన లేక క్యాన్సర్ వ్యాధి ముదిరిన తర్వాత ఆస్పత్రులకు వెళ్తున్నారని అన్నారు. దీంతో వ్యాధి నయం కావటానికి ఎక్కువ సమయం పడుతుందని, వైద్యం ఖర్చు కూడా పెరుగుతుందని చెప్పారు. ముందస్తు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్‌ను నివారించవచ్చని సూచించారు. మహిళ విభాగం ద్వారా రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 36 క్యాన్సర్ నిర్ధారణ ఉచిత శిబిరాలను ఏర్పాటు చేసి, వివిధ రకాల పరీక్షలు నిర్వహించి క్యాన్సర్ రోగులను గుర్తించామని వివరించారు. అనంతరం 81 మంది మహిళలకు ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ సమన్వయ కర్త మాధవీలత, సత్యసాయి సేవా సంస్థల బాధ్యులు జగదీశ్వర్ సింగ్‌ఠాకూర్, రాజేందర్ రెడ్డి, సిద్ధమ్మ, వీరేశంగౌడ్, ప్రేంకుమార్, అనంత్ రెడ్డి, మాజీ సర్పంచు నర్సింహారెడ్డి, ఎంఎన్‌జే అంకాలజీ వైద్యులు డాక్టర్ సీఎస్ ప్రసాద్, వినీల, స్వప్న, సేవాదళ్ సభ్యులు, ప్యారా మెడికల్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

నిరంతరం సేవలందిస్తాం

అంకిత స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రకాశ్‌కుమార్

దోమ: గ్రామాల్లో ఉండే పేదలకు నిరంతరం అంకిత స్వచ్ఛంద సంస్థ ద్వారా వివిధ రకాల సేవలు అందించేందుకు ముందుంటామని ఆ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రకాశ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధి బాస్‌పల్లిలో 74 మంది విద్యార్థులకు బ్యాగులు, మ్యాట్స్ తదితర సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా అంకిత స్వచ్ఛంద సంస్థ ద్వారా అనేక మంది పేదలకు సేవలు అందించామని పేర్కొన్నారు. ఎంతో మంది కార్మికులకు లేబర్ కార్డులు అందించడంతో పాటు ఆయా పాఠశాలలో విద్యార్థులకు బుక్స్, బ్యాగులు, షూలు, మ్యాట్‌లు అందించామని వివరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీ శ్రీశైలం, జర్నలిస్ట్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.